# రోమా సిలువపై

# ఆరు గంటలు

## చదువుటకు నియమించినవి #40

VII. ప్రభువు పరిచర్యలో చివరి వారం (కొనసాగింది).
- H. శుక్రవారం: యేసు మరణ దినం (కొనసాగింది).
  - 9. క్రీస్తు మరణం: సిలువ వేయడం (ముగిసింది).
    - సి. సిలువపై తొలి మూడు గంటలు (కొనసాగింది) (మత్తయి 27:35, 36, 39–44; మార్కు 15:24, 29–32; లూకా 23:34–37, 39–43; యోహాను 19:23–27).
    - డి. సిలువపై చివరి మూడు గంటలు (మత్తయి 27:45–56; మార్కు 15:33–41; లూకా 23:44–49; యోహాను 19:28–30).

### పరిచయం

క్రీస్తు మరణాన్ని కేంద్రంగా నిలిపిన రెండు భాగాల పాఠంలో యిది రెండవ భాగం. క్రీస్తు భౌతికమైన వేదనను గ్రహించడానికి సిలువ మరణం మీద కొంత నోట్సు అవసరమైయుంటుంది.[1]

ప్రాచీన కాలంలో "అమలులో ఉన్న మరణ దండనలలో సిలువ వేయడం చాలా హింసాత్మకమైన, అవమానకరమైన, భయానకమైన శిక్ష అని జాన్ ఫ్రాంక్లిన్ కార్టర్ వర్ణించాడు."[2] పారసీకులు, ఐగుప్తీయులు, బబులోనీయులు, ఫెనీకేవారు యింకను యితరులు సిలువ వేయడాన్ని శతాబ్దాల తరబడి అమలుచేస్తున్నారు. "అత్యధికమైన వేదనను బాధను పొందుతూ మెల్ల మెల్లగా చనిపోయే హింసగా రోమనులు దానిని రూపుదిద్దారు."[3]

ఈ చిత్రహింసలో ఉండే "మేధాబలం" ఏమంటే, ఒక వ్యక్తి మేకులతో సిలువకు బిగించబడినప్పుడు ప్రధానమైన అంగములేవీ తాకబడవు. అందును బట్టి మరణం నెమ్మదిగా వస్తుంది. ఆపదకు గురియైన ఆ వ్యక్తి మూడు, నాలుగు దినాలు కూడా బతికే అవకాశముంది. చనిపోయే ఆ మనిషి గాయాలను కీటకాలు పక్షులు సయితం పీడించే వీలుంటుంది. ఆ సమయంలో సిలువ వేయబడినవాడు భరించరాని వేదనను అనుభవిస్తూ, కాలిపోయే జ్వరంతో దాహంతో పరితపిస్తాడు. కడకు మరణమే విముక్తిగా పరిణమిస్తుంది.

[American Medical Association] అమెరికా వైద్య అసోసియేషన్ పత్రిక ప్రకారం,[4] "సిలువపైని మరణానికి కారణాలు అనేకాలుంటాయి." మొదటిగా, "అతడెంత

కాలం బతికి ఉంటాడనేది కొరడా దెబ్బల తీవ్రతమీద ఆధారపడియుంటుంది." సిలువపై వేలాడడానికి సంబంధించి, "ముంజేతిలో కొట్టబడిన మేకులు నరములను ఖండించి, రెండు చేతులలో అగ్నివంటి మహా వేదనను కలిగిస్తాయి." నిలువు కొయ్యకు పాదములు బిగింపబడి ఉంటాయి గనుక, పాదములు సయితం అదే వేదనను అనుభవిస్తాయి. నెమ్మదిగా రక్తం గాయాలనుండి కారిపోతూ ఉంటుంది. సిలువమీద ఉన్నవానిని బలహీనం చేయడానికే వీటిని నిర్దేశించారు.

"సిలువ వేయడంలో ప్రధానంగా శ్వాస బలహీనమౌతుంది ప్రత్యేకంగా ఊపిరి పీల్చడం కష్టమౌతుంది."[5] అంటే, సిలువకెక్కినవానికి దాదాపు గాలి పీల్చడం అసాధ్య మౌతుంది. "మేకులతో బిగింపబడిన కాళ్లమీద[6] దేహాన్ని పైకి తన్ని ఆ తరువాత తిరిగి క్రిందికి దిగుతూ ఉండాలి." దీనివలన మానని, తీరని కఠినమైన బాధ మోచేతులమీద, భుజములమీద ఒత్తిడి ఉంటుంది. "తత్ ఫలితంగా ప్రతి శ్వాసక్రియ అధికమైన వేదన కలిగించుతూ అలుపు వచ్చేలా చేస్తుంది." కడకు అలసిపోయిన ఆ వ్యక్తి "ప్రాణవాయువు లేమివలన" మరణించుతాడు.

క్రీస్తు రోమా సిలువపై ఆరు గంటలసేపు ఉండడాన్ని మనం పరిశీలిస్తున్నప్పుడు ఆయన ఎలాంటి వేదన అనుభవించారో మనస్సులో ఉంచుకోవాలి. మాటలాడడం ఊపిరికి సంబంధించిన విషయమైనందున, ఆయనకు ఆ సమయంలో ఎంత ఇబ్బంది అయిందో ఊహించుకోవాలి.

## తొలి మూడు గంటలు[7]

## (మత్తయి 27:35, 36, 39-44; మార్కు 15:24, 29-32; లూకా 23:34-37, 39-43; యోహాను 19:23-27)

క్రీస్తు సిలువపై నిలిచిన ఆరు గంటల సమయం రెండు మూడు గంటల కాలంగా విభజింపబడుతుంది: మూడు గంటల వెలుగు (మార్కు 15:25, 33), మూడు గంటల చీకటి (మార్కు 15:33).[8] మొదటి భాగం ఉదయం 9 గంటలనుండి మధ్యాహ్నంవరకు.

### సైనికులు చీట్లు వేసుకున్నారు

క్రీస్తు సిలువకు మేకులతో కొట్టబడడంతో మన గత పఠనం ముగిసింది. ఈ సిలువ వేసే బాధ్యత నలుగురు సైనికులకు అప్పగింపబడింది (యోహాను 19:23 చూడు). సిలువపై ఉన్న వ్యక్తి బట్టలు ఊడదీసి ఈ సైనికులకిస్తారు. క్రీస్తువారి బట్టలు తీసి ఈ నలుగురు సైనికులు సమంగా పంచుకున్నట్టున్నారు (యోహాను 19:23ఎ). ఈ వస్త్రాలలో తలపాగా, నడికట్టు,[9] చెప్పులు వగైరాలు కూడా చేర్చబడినట్టున్నాయి.

అయితే ఆయన "అంగీని" ఏమి చేయాలో వారికి వెంటనే తోచలేదు (యోహాను 19:23బి). KJVలో "కోటు" అని NIVలో "క్రింది వస్త్రము" అని ఉంది. గ్రీకులోనైతే "చర్మము తరువాత ధరించే వస్త్రము" అని ఉంది. ఆ వస్త్రము పైనుండి క్రిందివరకు

పూర్తిగా వేయబడియున్నందున సైనికులు "దిగ్భ్రమ చెందినట్టున్నారు" (యోహాను 19:23సి). సహజంగా ఆలాటి వస్త్రాలు రెండు మూడు ముక్కలను కలిపి తయారవుతాయి. అయితే అది "ఒకే బట్టతో తయారు చేయబడిందంటే" దాని విలువ ఎక్కువైయుంటుంది.[10] దాన్ని నాలుగు భాగాలుగా చింపితే దాని విలువ పోతుంది, పనికి రాకుండా పోతుంది.

"దానిని చింపక అది ఎవనికి వచ్చునో అని దానికోసరము చీట్లు వేయుదమని" ఆ రోమీయులు ఒకరితో ఒకరు చెప్పుకున్నారు (యోహాను 19:24ఎ; మత్తయి 27:35; మార్కు 15:24; లూకా 23:34లను చూడు). వారు అలా కోరుకొని చీట్లు వేసికొనడంలో, ఎరుగకయే వారు మెస్సీయాను గూర్చిన ప్రవచనాన్ని నెరవేర్చినవారయ్యారు: "వారు నా వస్త్రములను తమలో పంచుకొని నా అంగీకోసరము చీట్లు వేసిరి" అను లేఖనము నెరవేరునట్లు ఇది జరిగెను (యోహాను 19:24బి; కీర్తన 22:18 చూడు).

ఆ వస్త్రాలను పంచుకున్న తరువాత, "వారక్కడ కూర్చుండి ఆయనకు కావలి యుండిరి" (మత్తయి 27:36). క్రీస్తుకు "కావలియుండే" బాధ్యత ఆ సైనికునిపై ఉంది; ఆయనను కాపాడడానికి కాదు, ఆయన అభిమానులు వచ్చి, మరణానికి ముందు ఆయనను సిలువపైనుండి దింపకుండా చూసే పనివారిది (మత్తయి 27:54).[11] సిలువపై మరణం ఎక్కువసేపు పడుతుంది గనుక చాలసేపు వేచియుండాలని వారు నిరీక్షిస్తున్నారు.

**జనసమూహం అవమానించింది**

బాధను చూడాలనే చెడ్డ కుతూహలం కొందరికుంటుంది. "ప్రజలు నిలువబడి చూచుచుండిరి" (లూకా 23:35ఎ). ఆ మార్గన పోయేవారు ఎడతెరపిలేకుండ వెళ్లుతునే ఉన్నారు. వారు పండుగకొరకు పట్టణంలోనికి వస్తున్న యాత్రికులైయుండవచ్చు. "అప్పుడు ఆ మార్గమున వెళ్లుచున్నవారు తమ తల లూచుచు[12] – ఆహా దేవాలయమును పడగొట్టి మూడు దినములో కట్టువాడా,[13] సిలువ మీదనుండి దిగి, నిన్ను నీవే రక్షించుకొనుమని చెప్పి ఆయనను దూషించిరి" (మార్కు 15:29, 30). "నీవు దేవుని కుమారుడవైతే సిలువ మీదనుండి దిగుమని చెప్పుచు ఆయనను దూషించిరి" (మత్తయి 27:40బి).[14]

పరిహాసం చేయడాన్ని యూదా మతాధికారులే ప్రారంభించియుండవచ్చు. వారికి తల నొప్పిగా ఉన్న శత్రువును తీసివేశారన్న ఉత్సాహముతో; వారు చాలా సంతసిస్తూ ఉండవచ్చు. "అట్లు శాస్త్రులును ప్రధాన యాజకులును అపహాస్యము" చేస్తూ (మార్కు 15:31ఎ) "వీడితరులను రక్షించెను, తన్నుతాను రక్షించుకొనలేడు ..." అని అన్నారు:

> అధికారులు – వీడు ఇతరులను రక్షించెను; వీడు దేవుడేర్పరచుకొనిన క్రీస్తు అయినయెడల తన్నుతాను రక్షించుకొనునని అపహసించిరి (లూకా 23:35బి).
>
> వాడు దేవునియందు విశ్వాసముంచెను, నేను దేవుని కుమారుడనని చెప్పెను గనుక ఆయనకిష్టమైతే ఆయన ఇప్పుడు వానిని తప్పించునని చెప్పిరి (మత్తయి 27:43).

ఆయన తలపై ఉంచిన ఫలకాన్ని చూచి, "వీడు ... ఇశ్రాయేలు రాజుగదా, యిప్పుడు సిలువమీద నుండి దిగినయెడల వాని నమ్ముదుము" అని అపహసించారు (మత్తయి

27:42బి).[15] "వీడు ఇతరులను రక్షించెను; తన్నుతాను రక్షించుకొనలేదు" అంటూ వారు విజయ భేరిని మ్రోగించారు (మార్కు 15:31బి; మత్తయి 27:42ఎ). ఒక వ్యాఖ్యానకర్త యిలా అన్నాడు: "అనాలోచితంగానే లేఖనాల్లో ఉన్న మహా ఘనమైన సత్యాల్లో ఒక దానిని [ఆ నాయకులు] ఉచ్చరించారు"[16] వారు కలగన్న దానికంటే "లోతైన సత్యాన్ని వారు పలికారు: ఆయన యితరులను రక్షించాలంటే తన్ను ఎలా రక్షించుకుంటాడు?"[17]

ఆ వేడుకను సైనికులు ఆహ్వానించారు. "అంతట సైనికులు ఆయన యొద్దకు వచ్చి ఆయనకు చిరకనిచ్చి – నీవు యూదుల రాజువైతే నిన్ను నీవే రక్షించుకొనుమని ఆయనను అపహసించిరి'' (లూకా 23:36, 37). క్రీస్తు ప్రభువుతో పాటు బాధననుభవిస్తున్న – యిద్దరు దొంగలును – వారితో చేరారు. సాధారణంగా సిలువ వేయబడినవారు జనసమూహంతో నింద ప్రతినిందలు మోపుకొంటూ ఉంటారు. అయితే, ఈ సందర్భంలో మాత్రం, దృష్టి యావత్తు మధ్యనున్న సిలువపై కేంద్రీకరించబడింది. ఆ నేరస్థులు తమ కోపాన్నీ విసుగునూ అదే దిక్కుకు మరలించారు (మత్తయి 27:44; మార్కు 15:32బి).

### ప్రభువు ప్రార్థించారు

ఈ ద్వేషపు ఉరవడికి ప్రభువు ఎలా స్పందించారు? తన్ను బాధించేవారిని నాశనం చేయడానికి పండ్రెండు వ్యూహముల సైన్యాన్ని పిలిచాడా? (మత్తయి 26:53). లేదు, ఆయన ప్రార్థించారు! తమ్మును బాధించిన వారికొరకు ప్రార్థించుడని ఆయన తన శిష్యులకు ఉపదేశించారు గదా (మత్తయి 5:44). "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించు"మని ఆయన తాను ఉపదేశించినదానిని ఆచరించారు (లూకా 23:34ఎ).[18]

### దొంగ మనవి చేసికొన్నాడు

తొలి మూడు గంటలలో ఒక ఉత్తమమైన కార్యం జరిగింది. తాను చూచిన దానంతటిని బట్టి, ఆ దొంగలలో ఒకని హృదయం స్పందింప నారంభించింది. తొలుత యిద్దరు నేరస్థులు ప్రభువును దూషించారు (మత్తయి 27:44; మార్కు 15:32); అయినా, సమయం గడుస్తున్నకొలది, క్రీస్తు హుందా తనమును బట్టియు, ఔదార్యముగల స్వభావాన్ని బట్టియు ఒకడు తాకబడ్డాడు.[19] సిలువేయబడినవారు చనిపోవడం, దానికి ముందు తన చుట్టునున్నవారిని శపించడం అతడు చూచియుండవచ్చునేమో, కాని తన్ను బాధించినవారికొరకు ప్రార్థించినవానిని తానెన్నడు చూచియుండలేదు.

ఒక దొంగయైతే మాత్రం ఆయనమీద నిందలు రువ్వుతునేయున్నాడు, "నీవు క్రీస్తువు గదా? నిన్ను నీవు రక్షించుకొనుము, మమ్మును కూడ రక్షించుమని చెప్పెను" (లూకా 23:39). రెండవవాడు ప్రభువును సమర్థించుతూ: "వానిని గద్దించి – నీవు అదే శిక్షావిధిలో ఉన్నావు గనుక దేవునికి భయపడవా? మనకైతే యిది న్యాయమే; మనము చేసినవాటికి

తగిన ఫలము పొందుచున్నాము గాని యీయన ఏ తప్పిదమును చేయలేదని" చెప్పాడు (లూకా 23:40, 41).

అతడు తన తలను ప్రభువువైపు మరల్చి, "– యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను" (లూకా 23:42). యేసు రాజ్యాన్ని గూర్చి అతనికెలా తెలుసో? రాజ్యమును గూర్చిన క్రీస్తు ఉపదేశాన్ని అతడు వినియుంటాడా? తలపై కొట్టిన ఫలకం నిజమైనదని ఒప్పించడానికి తగిన నడవడిని క్రీస్తు ప్రభువు కనుపరచారా? మనకు తెలియదు. రాజ్యమును గూర్చిన ఆ దొంగకున్న జ్ఞానం పరిమితమైయుండవచ్చు. అయితే యేసు యూదులకు రాజు (కనిపెట్టబడుచుండిన మెస్సీయా) అనే సంగతిని అతడు కనీసం గ్రహించియుండాలి. సిలువలో ఆయన మరణించుతున్నప్పటికిని – ఆయన రాజ్యం స్థాపించుతాడనే వాస్తవం అతడు ఎరిగి యుంటాడు! ఆ క్షణాలలో, మరణించుతున్న ఆ దొంగ క్రీస్తు ప్రభువు శిష్యుల కంటెను అధికమైన విశ్వాసాన్ని ప్రదర్శించాడు.[20]

"నీవు నేడు నాతో కూడ పరదైసులో ఉందువు" అని మారుమనస్సు పొందిన ఆ దొంగతో అనడంలో ప్రభువైన యేసు "కడవరకు తన పేరుకును పనికిని నమ్మకంగా నిలిచారు"[21] (లూకా 23:43). ఈ సందర్భంలో, "పరదైసు" అనేది నీతిమంతులు తీర్పు దినంవరకు వేచియుండే అదృశ్య లోకాన్ని సూచిస్తుంది.[22] మారుమనస్సు పొందిన దొంగకు క్రీస్తు సిలువనుండి విముక్తి ప్రసాదించ లేదు కాని పాపదోషమునుండి విమోచన ప్రసాదించారు. ఈ జీవితంలో గాక, రాబోవు జీవితంలో అతని ఆయన స్వతంత్రునిగా చేశారు.[23]

## స్నేహితులు విలపించారు

సిలువ యెదుట నిలిచిన కొందరైతే ద్వేషమువలన గాక, దుఃఖంచేత దహింపబడ్డారు. ప్రభువైన యేసు సిలువ ఎదుట నిలిచినవారిలో ఒకరు ఆయన తల్లి (యోహాను 19:25బి). మరణమునందుకోబోతున్న కొడుకును కన్నీటి ధారలగుండా చూస్తున్న మరియ స్థానంలో నీవుండి చూడు. "నీ హృదయములోనికి ఒక ఖడ్గము దూసికొని పోవునని" సుమెయోను ఆమెను ముందుగానే హెచ్చరించాడు (లూకా 2:35ఎ); ఇప్పుడు పదునైన ఆ ఖడ్గము ఆమె హృదయంలోనికి తిరిగి దిగుతుంది.

మరియతో యింకను యితర స్త్రీలు కూడా నిలుచున్నారు "ఆయన తల్లి సహోదరియు, క్లోపా భార్యయైన మరియయు, మగ్దలేనే మరియయు" వారిలో ఉన్నట్టు యోహాను గుర్తించాడు (యోహాను 19:25సి). సిలువయొద్ద నిలిచిన స్త్రీలను గూర్చి యోహాను యిచ్చిన జాబితాతో మత్తయి మార్కు జాబితాలను పోల్చినట్టయితే (మత్తయి 27:56; మార్కు 15:40), మరియ యొక్క సహోదరి – యాకోబు యోహానుల తల్లియు, జెబెదయి భార్యయైన సలోమి అన్నట్టు కన్పిస్తుంది.[24] ఈ సలోమిని గూర్చి గతంలో మనం చదివాం (మత్తయి 20:20, 21).[25]

"క్లోపా భార్యయైన మరియ" అని యోహాను జాబితాలో ఉన్న ఆమె, మత్తయి మార్కు జాబితాలో ఉన్న చిన్న యాకోబు యోసే అనువారి తల్లియైన మరియయా?

మగ్దలేనే మరియ ఆ మూడు జాబితాల్లో ఉంది. ఇంతక మునుపు మన స్టడీలో ఆమెను చూచాం (లూకా 8:2, 3),[26] యింకను చూడ బోతాం.

ప్రభువు వారికి "పరిచయమైన" యితరులు కూడా సిలువ ఎదుట నిలిచియున్నారు (లూకా 23:49ఎ; మార్కు 15:41బి). అపొస్తలులందరు లేక కొందరు దూరమునుండి తిలకించుతూ ఉండవచ్చు. కనీసం అపొస్తలుడైన యోహాను సిలువ చెంత నిలిచియున్నాడు (యోహాను 19:26[27]).

### ప్రభువు ఏర్పాటు చేశారు

చెప్పనశక్యమైన వేదనను క్రీస్తు అనుభవించుతున్నప్పటికిని, తన తల్లి యోగ క్షేమమును గూర్చి అక్కర కలిగియున్నారు.[28] ఆమె దుఃఖాన్ని ఆయన చూచినప్పుడు ఆయన హృదయం ఆవేదనతో నిండి ఉండవచ్చు. యోహాను ప్రక్కనే నిలిచి చూస్తూ ఉండగా చూచి, "– అమ్మా,[29] యిదిగో నీ కుమారుడు అని తన తల్లితో చెప్పెను. తరువాత శిష్యుని చూచి – యిదిగో నీ తల్లి అని చెప్పెను" (యోహాను 19:26, 27ఎ). ఈ విధంగా ప్రభువు తన తల్లి పోషణకు తగిన ఏర్పాటు చేశారు.[30]

"ఆ గడియనుండి ఆ శిష్యుడు ఆమెను తన యింట చేర్చుకొనెను" (యోహాను 19:27బి). దయతో వెంటనే[31] అతడు ఆమెను గొల్గొతా దృశ్యంనుండి దూరంగా తీసికొని వెళ్లియుండవచ్చు. అటు తరువాత ఆ పండుగ సమయంలో తన కుటుంబం వెళ్ళిన చోటికంతా ఆమెను తోడుకొని పోయి ఉండవచ్చు. అతడలా చేసినందువల్ల తన కుమారుని వేదన కొంతవరకు చూడకుండానూ అమానుషమైన ఆ గుంపునుండి దూరంగానూ తొలగింది.

## చివరి మూడు గంటలు
## (మత్తయి 27:45-56; మార్కు 15:33-41;
## లూకా 23:44-49; యోహాను 19:28-30)

### మర్మము

"అప్పుడు రమారమి మధ్యాహ్నమాయెను" (లూకా 23:44ఎ) – అంటే, సూర్యుడు సంపూర్ణ ప్రకాశంతో వెలిగే సమయమది. "అది మొదలుకొని మూడు గంటల వరకు ఆ దేశమంతటి మీద చీకటి కమ్మెను; సూర్యుడు అదృశ్యుడాయెను" (లూకా 23:44బి, 45ఎ). చీకటి తటాలున కలిగిందా? అది యూదయ దేశానికి మాత్రమే పరిమితమయ్యిందో, పాలస్తీనా అంతటిని అలుముకుందో, అంతకంటే ఎక్కువగా అది విస్తరించిందో తెలియదు. "ఆ దేశమంతయు" అనే ప్రయోగంలో ఏదైనా వీటిలో కావచ్చు. రోమను దస్తావేజులు సయితం ఈ అసాధారణమైన సంఘటనను దాఖలు చేసి యుండవచ్చు.[32]

చీకటి సూర్య గ్రహణంవలన ఏర్పడిందని అభిప్రాయాలు వెల్లడయ్యాయి. కాని

పస్కాపండుగ దినాల్లో సూర్య గ్రహణంవచ్చే అవకాశం లేదు. ఎందుకంటే, "ఈ పండుగ పున్నమి దినాల్లో జరుగుతుంది (నిర్గమ. 12:6)"[33] – పున్నమినాడు సూర్య గ్రహణం కలిగే వీలులేదు.[34] మేఘమయమైన ఆకాశం కూడా ఈ చీకటిని వివరించలేదు. ఈ చీకటి అలౌకికమైన సంభవమని విశ్వసించడానికి ఆధారముంది. (1) ఈ చీకటిని దేవాలయపు తెర చినగడానికి లూకా ముడివేశాడు (లూకా 23:44, 45), అది ఖచ్చితంగా అద్భుతమైయుండే తీరాలి.[35] (2) యేసు మరణంతో చీకటి తొలగింపబడిందంటే అందులో దేవుని జోక్యమున్నట్టు తెలియవస్తుంది.

ఆ భూమిమీద చీకటి "మూడు గంటలసేపు" నిలిచియుంది (లూకా 23:44సి) అంటే, సాయంకాలం మూడు గంటలవరకు, అయితే జాన్ కార్టర్ చెప్పేది సరిగా విషయ వివరణ కావచ్చు:

> ... ఆయనను హేళన చేస్తూ బోధిస్తున్నవారినుండియు దుఃఖసాగరంలో మునిగిపోయిన తన స్నేహితులనుండియు రక్షకుడు చీకటియను తెరతో దాచబడడం తగిన కార్యమై యుంది. ఆ దేశాన్ని చీకటి క్రమ్మగానే హేళన చేస్తూ నిందించుతున్నవారి శబ్దం నిజంగానే మాన్పివేయబడియుండవచ్చు. యేసు చీకటిలో వేదన అనుభవించడానికి విడిచిపెట్టబడ్డారు. ఆ చీకటి గడియలలోనే దేవుడు మన అందరి పాపము ఆయన మీద మోపియుంటాడు (యెషయా 53:6). మన పాపమును మ్రానుమీద ఆయన మోశారు (1 పేతురు 2:24); మరియు ఆయన పాపముగా చేయబడ్డారు (2 కొరింథీ. 5:21) తన రక్తమునందు దేవుడు కరుణాధారముగా ఆయనను నిలిపారు (రోమా 3:25). ఒకవిధంగా "వెలుపటి చీకటి"లోని బాధలను అనుభవించుతూ, తన్ను వెంబడించేవారికి జీవపు వెలుగును ప్రసాదించడానికి యిలా చేసియుండవచ్చు (యోహాను 8:12).[36]

**భావము**

చీకటి గడియలు ముగియవచ్చేసరికి, వెంట వెంటనే క్రీస్తు నాలుగుసార్లు పలికారు, మొదటిది, "దాదాపు మూడు గంటల ప్రాంతంలో," ఆయన సహించుతున్న భయంకరమైన వేదనను ప్రతిస్పందించే మాటలను: "ఏలీ, ఏలీ, లామా సబక్తానీ" అని పలికారు (మత్తయి 27:46ఎ). ఆ హెబ్రీ మరియు ఆరామీ మాటలకు[37] "నా దేవా, నా దేవా, నన్నెందుకు చెయ్యి విడిచితివని అర్థము" (మత్తయి 27:46బి) మన పాప ఋణమును చెల్లించుటలో, దేవుడు తన కుమారుడైన యేసును – కొంత సమయం – విడనాడినట్లు ఈ ప్రశ్న స్థాపించుతుంది.[38]

వచ్చే ప్రశ్నేమంటే: "క్రీస్తు తన మరణ ఉద్దేశాన్ని గ్రహించలేదా అలా గ్రహించియుంటే, నీవు నన్ను ఏల విడనాడితివని ఆయన దేవుని ఎందుకు అడుగుతున్నట్టు?" దీనికి శ్రేష్ఠమైన వివరణ ఏమంటే క్రీస్తు కీర్తన. 22:1ని కోట్ చేస్తూ, దాని అసలైన పదప్రయోగాన్ని నిలుపుతున్నారు. ప్రభువు యొక్క ప్రతిపాదన సందేహాన్ని ప్రకటించేది కాదు, కాని విశ్వాసాన్ని స్థాపించునదైయుంది. తన మరణం దురదృష్టకరమైన విపత్తు కాక, దేవుని ఉద్దేశమును ఆయన సంకల్పాన్నీ నెరవేర్చునదైయుందని ఆ కీర్తనను కొటే్ చేయడంవలన స్థాపించారు (కీర్తన 22:6-8, 12-18లను చూడు).

క్రీస్తు ఆ కేక వేసినప్పుడు, ఆయన చెప్పినదేమో కొందరికి అర్థం కాలేదు, శ్వాస పీల్చే ప్రయాసలో ఆయన పలుకులు కొంత తడబడి ఉండవచ్చు; లేక వారి ఆలోచనలు ఎక్కడెక్కడో తిరుగుతూ ఉండవచ్చు. కొందరు వృద్ధులైనందున వారి వినికిడిలో కొంత లోపం ఉండియుండవచ్చు, కారణమేమైయున్నా, "ఏలీ" ("నా దేవా") అని క్రీస్తు పలికినప్పుడు "ఏలీయా" (అంటే, "నా దేవుడు యెహోవా") అని ఆయన చెప్పినట్టు కొందరు తలంచి, "ఆయన ఏలీయాను పిలుస్తున్నాడన్నారు" (మత్తయి 27:47). మెస్సీయా కాలంలో, ఏలీయా ప్రత్యక్షమౌతాడని శాస్త్రులు బోధించేవారు (మత్తయి 17:10).[39] ఆకర్షితులై, కొందరు, "ఏలీయా ఆయనను రక్షింప వచ్చునేమో" చూతమనిరి (మత్తయి 27:49; మార్కు 15:36).

వారు అపార్థం చేసుకున్నదాన్ని దిద్దడానికి ప్రభువు ఏ విధంగాను ప్రయత్నించలేదు, కాని, "సమస్తమును అప్పటికి సమాప్తమైనదని[40] యేసు ఎరిగి, లేఖనము[41] నెరవేరునట్లు – నేను దప్పిగొనుచున్నాననెను" (యోహాను 19:28) "వారు ఒక స్పంజీ చిరకతో నింపి,[42] హిస్సోపు పుడకకు తగిలించి ఆయననోటికి అందించిరి" (యోహాను 19:29; మార్కు 15:36ఎ). ముందుగ యేసు ఆ చిరకను నిరాకరించారు; యిప్పుడైతే ఆయన దానినంగీకరించారు (మత్తయి 27:34; మార్కు 15:23; యోహాను 19:30ఎ). శ్రమపడడం దాదాపుగా ముగింపుకు వచ్చింది గనుక బాధకు ఉపశమనం కలిగించే గుణమున్న ఆ ద్రావకాన్ని తీసుకోడానికి ఇప్పుడు అవసరంలేదు. బహుశ దప్పికతో పాటు తాను మాట్లాడబోయేదానికి గొంతును తడుపుకోవాలని అనుకుని ఉండవచ్చు.

యేసు ఆ చిరక (పుల్లటి ద్రాక్షా రసాన్ని)ను పుచ్చుకొని " సమాప్తమైనదని" చెప్పారు (యోహాను 19:30ఎ). ఆయన బాధ దాదాపుగా అంతరించింది, అయితే ఆయన పలుకులలో గాఢమైన భావముంది. తాను చేయుటకు దేవుడు తనకు అప్పగించిన పనిని ఆయన ముగించారు (యోహాను 17:4 చూడు[43]). బి. ఎస్. డీన్ యిలా రాశాడు,

> "సమాప్తమైనది"; సమాప్తమయ్యిందంటే కేవలం భూతలముపై జీవించిన మహా గంభీరమైన జీవితం అంతమయ్యిందని కాదు. పితరులు, మరియు ప్రవక్తలు ఊహించిన (కలగన్న) దానికంటే ఎంతో ఔన్నత్యంగా మానవ విమోచన పాతనిబంధన ప్రవచానాల గురుతులు మాదిరులతో సమాప్తమయ్యింది, నేరవేర్చబడింది.[44]

చార్లెస్ స్విండల్ యిలా అన్నాడు: క్రీస్తు పలుకులు "విజయపు కేక, … సాధించిన కేక … అవును … విముక్తి కేకయై ఉంది. యేసు యిప్పుడు ముండ్లను మకుటముగాను, తన దిగంబరత్వాన్ని రాజ వస్త్రముగాను, తన అవమానమును మహిమగాను, తన గాయాలను అరాధనగాను మార్చుకొనగలడు."[45]

అప్పుడు క్రీస్తు, "గొప్ప శబ్దముతో,"[46] కేకవేసి "తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించు కొనుచున్నాననెను"[47] (లూకా 23:46ఎ). "ఆయన యిలాగు చెప్పి" (లూకా 23:46బి), "తలవంచి ఆత్మను అప్పగించెను" (యోహాను 19:30బి). ప్రభువు "ప్రాణము విడిచెను" (లూకా 23:46సి; మార్కు 15:37). ఆయన "లేఖనముల ప్రకారము మన పాపముల నిమిత్తము చనిపోయెను" (1 కొరింథీ. 15:3).

ప్రభువు అంత త్వరగా ఎందుకు చనిపోయారో ఊహింపసాగారు,[48] కాని ఈ వచనాలు మనకు సంగతులను తెలుపుతాయి: ఆయన చనిపోడానికి యిష్టపడ్డారు. మనుష్యులు ఆయన ప్రాణాన్ని తీయలేదు; మన అందరికొరకు ఆయన దానిని సమర్పించారు (యోహాను 10:17, 18).[49]

**అద్భుతములు**

ప్రభువు మృతిచెందిన ఆ సమయంలో, గొప్ప భూకంపం కలిగింది (మత్తయి 27:54): "భూమి వణకెను ; బండలు బద్దలాయెను" (మత్తయి 27:51). కొండలలోనికి తొలవబడిన "సమాధులు తెరవబడెను; నిద్రించిన అనేకమంది పరిశుద్ధుల శరీరములు లేచెను" (మత్తయి 27:52ఎ). వారు సమాధులలోనుండి కొద్ది దినాల తరువాత లేచి వచ్చినట్టు కన్పిస్తుంది. ఎందుకంటే, "వారు సమాధులలోనుండి బయటికి వచ్చి ఆయన లేచిన తరువాత పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు అగపడిరి" అని మత్తయి తరువాత అంటున్నాడు (మత్తయి 27:52ఎ, 53).

ఆ పట్టణంలో భూమి కంపించగా, "దేవాలయపు తెర పైనుండి క్రిందివరకు రెండుగా చినిగెను" (మత్తయి 27:51ఎ; మార్కు 15:38; లూకా 23:45). అసాధారణమైన ఈ సంభవాలు "భూమి వణకినట్టు" ప్రకటిస్తున్నాయి![50]

చీకటి, భూకంపం అనే రెండు అద్భుతాలే గొల్గొతాలో ఉన్నవారికి తెలిసి ఉంటాయి. క్రీస్తు సిలువలో కనుపరచిన ప్రవర్తన వారిమీద గొప్ప ప్రభావాన్ని ప్రదర్శించింది. "ఆయనకెదురుగా నిలిచియున్న శతాధిపతి ఆయన ఈలాగు ప్రాణము విడుచుట చూచి – నిజముగా ఈ మనుష్యుడు దేవుని కుమారుడే అని చెప్పెను" (మార్కు 15:39ఎ). అతనితో కూడ యేసునకు కావలియున్నవారును, "భూకంపమును జరిగిన కార్యము లన్నిటిని చూచి, మిక్కిలి భయపడి" – నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి (మత్తయి 27:54ఎ). "ఈ మనుష్యుడు నిజముగా నీతిమంతుడైయుండెనని చెప్పి" శతాధిపతి "దేవుని మహిమపరచెను" (లూకా 23:47). అటు శతాధిపతియు, యిటు సైనికులు "ఈయన నిజముగా దేవుని కుమారుడ"ని ఒప్పుకున్నారు (మార్కు 15:39బి; మత్తయి 27:54బి).[51]

అద్భుతాలు యితరుల మీదకూడా వాటి ప్రభావాన్ని కనుపరచాయి. వారు కలిగిన చీకటిని బట్టి నోళ్లు మూయించబడినట్టున్నారు. "చూచుటకై కూడివచ్చిన ప్రజలందరు జరిగిన కార్యములు చూచి, రొమ్ముకొట్టుకొనుచు తిరిగి వెళ్లిరి" (లూకా 23:48) – తూర్పు దేశాలవారు తమ విచారాన్ని వ్యక్తపరచే విధానమది (యెషయా 32:12; నహూము 2:7; లూకా 18:13[52]). కొన్ని వారాల తరువాత బయలు వెడలిన పేతురు ప్రసంగానికి జరిగినయన్నీ వారి హృదయాలను సిద్ధపరచినట్టున్నాయి (అపొ. 2:14, 23, 36, 37లను చూడు).

# ముగింపు

యేసు దేవుని కుమారుడు; అందువలన, మన సమస్త జ్ఞానానికి మించినదిగా ఆయన మరణం ఉంటుందని మనం ఎదురు చూడవచ్చు. దేవుని సొంత కుమారుడు సిలువపై మరణించడాన్ని మనం చూచాం! ఎంత ఆశ్చర్యం! మన విమోచనకై మృతిపొందినట్టు లేఖనాలు తెలుపుతున్నాయి (1 కొరింథీ. 15:3). అద్భుతమైన ఈ సత్యమందు మనం ఆనందించుదాం!

---

సూచనలు

[1]"The Best Gift of All," in "Undenominational Christianity," *Truth for Today* (October 2001): 44-45 చూడు. [2]John Franklin Carter, *A Layman's Harmony of the Gospels* (Nashville: Broadman Press, 1961), 326. [3]William D. Edwards, Wesley J. Gabel, and Floyd E. Hosmer "On the Physical Death of Jesus Christ," *Journal of the American Medical Association* (21 March 1986): 1458. [4]Ibid., 1460-61. [5]"గాలి పీల్చడం" అనేది శ్వాసకు సంబంధించింది. [6]మరణం త్వరగా కలగడానికి వారి కాళ్లు విరుగగొట్టడం ఎందుకు అవసరమో (యోహాను 19:31–33) తెలుస్తుంది. కాళ్ల మేకులమీద దేహాన్ని పైకి లేపుకొని గాలి పీల్చుకొని, దాన్ని వదలడానికి తిరిగి క్రిందికి జారుతూ ఉంటారు. [7]"క్రీస్తు జీవితం 6లో" సిలువపై తొలి మూడు గంటల వివరాలు చూడు. [8]సంఘటనలు ఏ క్రమంలో జరిగాయో మనకు తెలియదు; యిక్కడ యివ్వబడింది జరిగే ఒక అవకాశం మాత్రమే. [9]"నడికట్టు" అనేది తెలుగువారికి అర్థమయ్యేదేలే. [10]"ప్రభువుకు సొంతమై విలువగలిగింది" యిది ఒక్కటే యన్నట్టు అనబడుతుంది, ఆయన అభిమానుల్లో ఎవరైనా ప్రభువుకు దీనిని యిచ్చియుండవచ్చు.

[11]ఆ యిద్దరి దొంగల వస్త్రములు పంచుకొనే విషయం మనకు తెలియదు. [12]ప్రతి నాగరికతలోను హేళనచేసే గురుతులుంటాయి (కీర్తన. 22:7; 109:25; యెషయా 37:22; యిర్మీయా 18:16). [13]దేవాలయాన్ని తిరిగి కడతానన్న ప్రభువు మాటలు మనుష్యుల హృదయాల్లో నాటుకున్నాయి గాని, అవి అపార్థం అయ్యాయి, తప్పుగా కోట్ చేయబడ్డాయి (యోహాను 2:19) "క్రీస్తు జీవితం 6లో" చూడు. [14]క్రీస్తు తన్ను రక్షించుకొని సిలువపైనుండి దిగివస్తే, ఆయన లోకాన్ని (యితరులను) రక్షించలేడన్న సంగతి ప్రజలకు అప్పటిలో అర్థం కాలేదు. తన తండ్రి చిత్తం నెరవేర్చడానికి తన్నుతాను అప్పగించుకొని సిలువపై నిలిచియుండిన దేవుని కుమారుడని వారు గ్రహింపలేదు. [15]కొద్ది దినాల్లో, సిలువపైనుండి దిగివచ్చే దానికంటెను గొప్ప అద్భుతం – సమాధిలోనుండి సజీవుడై వచ్చే అద్భుతం ఆయన చేయనైయున్నాడు – అయితే అదికూడా కఠిన హృదయాలలో విశ్వాసాన్ని పుట్టించలేక పోయింది. క్రీస్తు సిలువపైనుండి దిగిరానిదే కోట్లకొలది మనుష్యుల హృదయాల్లో విశ్వాసాన్ని పుట్టిస్తుందన్న సంగతి వారు ముందుగా చూడలేకపోయారు (యోహాను 12:32). [16]H. I. Hester, *The Heart of the New Testament* (Liberty, Mo.: Quality Press, 1963), 214. [17]B. S. Dean, "బైబిలు చరిత్ర యొక్క సంక్షిప్త వర్ణన" అనే పుస్తకమును చూడు. [18]సిలువపైనుండి క్రీస్తు "పలికిన"వాటిలో యిది మొదటిది. తన్ను బాధించినవారి కొరకు ప్రభువు ప్రార్థించినా, వారు మారుమనస్సు పొంది దేవుని చిత్తం జరిగించే వరకు వారు క్షమాపణను అనుభవించ లేదు (అపొ. 2:22, 23, 36–38) "యజమానుని కలిసికో, 1లో" చూడు. [19]ఇద్దరు దొంగలు ప్రభువును అవమానపరచినట్టు మత్తయి మార్కులిద్దరు సూచించారు. వారిలో ఒకడు ప్రభువు పక్షంగా నిలిచినట్టు లూకా అంటున్నాడు. వారిలో ఒకడు ముందుగా ఆయనను నిందించినా, తరువాత మారుమనస్సు పొంది యుండ వచ్చునని చెప్పవచ్చు. [20]"సిలువలోని దొంగ" మాదిరి నేటి "సువార్త" విధేయతకు పరిపూర్ణమైన మాదిరి కాదు.

[21]Dean, 29. [22]"అబ్రాహాము రొమ్ము" అనే పేరుతో "పరదైసు" అనే ఈ భాగం పిలువబడుతుంది (లూకా 16:22). మృతిపొందిన తరువాత ప్రభువు ఈ ప్రదేశానికి వెళ్లినట్టు పేతురు తెలిపాడు (అపొ. 2:31). "పరదైసు" పరలోకం కాదని మనకు తెలుసు. కొన్ని దినాల తరువాత ఆయన యింకా పరలోకానికి ఎక్కిపోలేదని ప్రభువు తెలిపారు (యోహాను 20:17). [23]భూమిమీదనున్న దినాల్లో, పాపులను క్షమించే అధికారం ప్రభువుకు ఉంది (మార్కు 2:10 చూడు). ఆయన అధికారాన్ని వినియోగించిన సమయం యిదొకటి. [24]"సిలువయొద్ద నిలిచిన స్త్రీలు" అనే అనుబంధపు పాఠం

చూడు. [25]"క్రీస్తు జీవితం, 5" చూడు. [26]"క్రీస్తు జీవితం, 2" చూడు. [27]"యేసు ప్రేమించిన శిష్యుడు" అనేది యోహానును సూచిస్తుంది. [28]మరియకు జ్యేష్ఠకుమారుడుగా, ఆయన ఆమె పట్ల ప్రత్యేకమైన బాధ్యతను కనుపరచినట్టున్నారు. ప్రభువు ఆమె పోషణకు వేరే ఏర్పాటు చేశారంటే, అప్పటికి యోసేపు చనిపోయి ఉంటాడనేది సూచింపబడుతుంది. [29]వివరణ తెలుగులో అనవసరం. [30]ఆ సమయంలో తన సహోదరులు ఆయన యందు విశ్వాసముంచినందున ప్రభువు తన తల్లి బాధ్యతను యోహానుకు అప్పగించినట్టున్నారు (యోహాను 7:5). వారు అప్పుడు సిలువయొద్ద లేకుండవచ్చు.

[31]క్రీస్తు మరణించిన తరువాత పేర్కొనబడిన స్త్రీ జాబితాలో మరియ కన్పించదు (మత్తయి 27:56; మార్కు 15:40) దీనిని బట్టి యోహాను ఆమెను తన యింటికి తోడుకొనిపోయినట్లును తాను మాత్రమే ఆయన మరణాన్ని చూడవచ్చినట్టును తెలుస్తుంది (యోహాను 19:35). [32]"కల్వరి అద్భుతాలను" అనే అనుబంధపు పాఠం తిరిగి చూడు. [33]M. R. Wilson, "Passover," *International Standard Bible Encyclopdia*, gen. ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 3:676. నిర్గమ. 12:6 నెలలో14 నాడు పున్నమి అన్నట్టు సూచిస్తుంది. [34]నిండు చంద్రుడు అంటే భూమి సూర్యచంద్రులు ఎదురుగా ఉన్నట్టు సూచిస్తుంది. చంద్రుడు భూమికిని సూర్యునికిని మధ్య వచ్చినప్పుడు సూర్య గ్రహణం ఏర్పడుతుంది – సూర్యచంద్రులు ఎదురెదురుగా ఉంటే సూర్యగ్రహణం అసాధ్యమౌతుంది. [35]"కల్వరి అద్భుతాలను" అనే పాఠం చూడు. [36]Carter, 329. [37]"ఏలీ" అనేది హెబ్రీ పదం – "లామా సబక్తాని" అనేవి అరామి పదాలు. మార్కు ఏలీ అనేదానికి "ఎలోయీ" అనే అరామి పదాన్నే వినియోగించాడు (మార్కు 15:34). ఈ రెండు తర్జుమాలలో చిన్నతేడా ఉంది. [38]"క్రీస్తు జీవితం, 6"లో క్రీస్తు ఆత్మ సంబంధమైన వేదనను గూర్చి చూడు. [39]"క్రీస్తు జీవితం, 1"ని చూడు. [40]భూలోకానికి వచ్చిన ప్రధానమైన పనిని ప్రభువు ముగించారు: తన శరీరమందు "మన పాపములను మ్రానుమీద మోసికొనెను" (1 పేతురు 2:24).

[41]"దప్పిగొనియున్నాను" అనేది పాతనిబంధన ప్రవచనాన్ని నెరవేర్చింది. ఇది కీర్తన. 22:15బి ని గాని 69:21ని గాని సూచించవచ్చు. లేఖనము నెరవేర్చబడునట్టు అంటే క్రీస్తు సిలువపై అనుభవించిన సమస్తాన్ని సూచింపవచ్చు. [42]హిస్సోపు అనేది మొక్క. అది రెండు మూడు అడుగుల ఎత్తువరకు పెరుగవచ్చు. [43]"నెరవేర్చి" అనే యోహాను 17:4లోని పదము, "సమాప్తమైనది" అని యోహాను 19:30లోని పదం ఒకే గ్రీకు పదంనుండి తర్జుమా చేయబడ్డాయి. [44]Dean, 29. క్రీస్తు పాతనిబంధనను "నెరవేర్చారు" (మత్తయి 5:17, 18) అంటే, ఒక విధంగా ఆయన ఆ నిబంధనను తన సిలువకు కొట్టాడు (కొలస్సీ. 2:14), క్రొత్తనిబంధన స్థాపనకు మార్గం సరాళం చేశారు (హెబ్రీ. 9:15–17). [45]Charles R. Swindoll, *Jesus, Our Lord* (Fullerton, Calif.: Insight for Living, 1987), 27. [46]తన భౌతికమైన స్థితిలో ఆయన కేకవేశాడంటేనే ఆశ్చర్యం. [47]క్రీస్తు తిరిగి పాతనిబంధన పద ప్రయోగం వినియోగించియుండవచ్చు (కీర్తన. 31:5). అలా జరిగియుంటే, కీర్తన. 31 రచయితలకంటే ఎక్కువ స్పష్టంగా ఆయన ఉపయోగించాడు. [48]సిలువపై మనుష్యులు అనేక దినాలు ఉండేవారని మొదట్లో చెప్పబడింది. క్రీస్తు అంతలోనే మరణించడం జనులను ఆశ్చర్యపరచింది (మార్కు 15:44). [49]ఆయన మరణానికి దారితీసిన సంగతులు యిక్కడను, తరువాత పఠనంలోను చర్చింపబడినా, నిర్ణయమనేది ఆయన తీసికొన్నదే. క్రీస్తు తన్నుతాను చంపుకోలేదు. రోమా సిలువపై యూదుల చేత చంపించబడ్డాడని బైబిలు బోధిస్తుంది (అపొ. 2:23; 3:15; 5:30; 10:39). అదే సమయంలో తన శరీరం మీద ఆయనకు కంట్రోలు ఉంది – ఆత్మహత్యకును త్యాగపూరితమైన మరణానికి వ్యత్యాసముందని నా సహోదరుడు కాయ్ అంటాడు. తన తోటి సైనికులను కాపాడడానికి ఒక సైనికుడు గ్రెనేడ్ మీద పడిపోయాడని అతడు ఉదహరిస్తాడు. (Personal correspondence, 3 April 2002). [50]"కల్వరి అద్భుతాలను" అనే అనుబంధపు పాఠం చూడు.

[51]మత్తయి 27:54 లేక మార్కు 15:39 వచనాలలో డిఫనెట్ ఆర్టికల్ లేనందున "ఒక దేవుని కుమారుడు" అని తర్జుమా చేయరాదు. "నిజముగా ఈయన దేవుని కుమారుడు" అని సైనికులు చెప్పారు. [52]"క్రీస్తు జీవితం, 5" లూకా 18:13 నోట్సు చూడు. [53]G. C. Brewer, *Christ Crucified: Brewer's Sermons* (Nashville: B. C. Goodpasture, 1952), 43-55.